శనివారం 24-08-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 434 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com


# ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పుదాం

- వివాదాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి
- అన్ని విధాలా సహాయం చేసేందుకు భారత్ సిద్ధం
- ఉక్రెయిన్ పర్యటనలో ప్రధాని మోడీ

ముందడుగు జాతీయం:

ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం కొనసాగుతోన్న వేళ ఉక్రెయిన్‌లో పర్యటించిన ప్రధాని మోడీ.. ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో అనేక విషయాలపై చర్చించినట్లు తెలిపింది. ఈ ప్రాంతంలో శాంతి నెలకొల్పేందుకు భాగస్వామ్య పక్షాల మధ్య వాస్తవిక సంప్రదింపులు అవసరమని పునరుద్ఘాటించినట్లు పేర్కొంది.



మోడీ ఉక్రెయిన్ పర్యటన చరిత్రాత్మకమని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ఇక్కడ సాధ్యమైనంత త్వరగా శాంతి నెలకొల్పేందుకు అన్ని విధాలుగా సహకరించేందుకు భారత్ సిద్ధంగా ఉందని అధ్యక్షుడు జెలెన్‌స్కీకి మోడీ స్పష్టం చేశారని అన్నారు. భేటీ సందర్భంగా సైనిక స్థితిగతులు, ఆహార, ఇంధన భద్రతతో పాటు శాంతిని నెలకొల్పే మార్గాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారని అన్నారు. మరోవైపు, గ్లోబల్ పీస్ సమ్మిట్‌లో తన భాగస్వామ్యాన్ని కొనసాగించాలని భారత్‌ను ఉక్రెయిన్ కోరినట్లు చెప్పారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా సహకారం అందించుకునేందుకు ఇరువురు నేతలు తమ సంసిద్ధతను వ్యక్తం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడి పుతిన్‌తో జులైలో మోడీ జరిపిన చర్చల వివరాలను జెలెన్‌స్కీకి వివరించారని అన్నారు.

### భారత్-ఉక్రెయిన్ మధ్య 4 ఒప్పందాలు

జెలెన్‌స్కీతో భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు కుదిరినట్లు భారత ప్రభుత్వం వెల్లడించింది. వ్యవసాయం, ఆరోగ్యం, సంస్కృతి, మానవతా సాయం అంశాలపై పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు వాణిజ్యం, ఆర్థిక అంశాలు, రక్షణ రంగం, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయం, విద్య అంశాలపై ఇరువురు నేతలు ర్చించుకున్నారని, ఉక్రెయిన్‌లో యుద్ధానికి సంబంధించే ఎక్కువ మాట్లాడుకున్నట్లు తెలిపింది.

# నెలకు రూ.300కే ఇంటర్‌నెట్, కేబుల్ టీవీ

## కేంద్ర టెలికాం మంత్రితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ



ముందడుగు జాతీయం:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింథియాతో భేటీ అయ్యారు. టీ-ఫైబర్ ప్రాజెక్టును భారత్ నెట్ ఫేజ్-3 పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతం మీడియాతో మాట్లాడుతూ.. గ్రామాలు, మండలాలకు నెట్‌వర్క్ కల్పించడమే టీ ఫైబర్ లక్ష్యమన్నారు. 65 వేల ప్రభుత్వ సంస్థలకు జీ2జీ, జీ2సీ సేవలు అందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 63 లక్షల ఇళ్లకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

"పట్టణ ప్రాంతాల్లో 30 లక్షల గృహాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తాం. నెలకు రూ.300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ-ఎడ్యుకేషన్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. టీ-ఫైబర్ అమలుకు ఎన్ఎఫ్ఓఎన్ సహకారం అవసరం. భారత్ నెట్ పథకాన్ని టీ-ఫైబర్‌కు వర్తింపజేయాలి. టీ-ఫైబర్‌కు రూ.1,779 కోట్ల వడ్డీ లేని రుణం ఇవ్వాలి" అని సీఎం కోరారు.




అర్హతలేని సిబ్బందితో విమానం ఆపరేషన్

మిగతా 2లో



చర్యకు ప్రతిచర్య తప్పదు

మిగతా 2లో




చిత్రహింసలు కేకలు ఎవరికి వినిపించలేదా..

మిగతా 2లో



క్షణాల్లో మనిషి ప్రాణాలు తీసే జంతువులు..

మిగతా 5లో

# కేజ్రీవాల్‌ను విచారించనున్న సిబిఐ

## అనుమతి ఇచ్చిన ప్రత్యేక కోర్టు

ముందడుగు జాతీయం:

ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్ట్ అయినా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను విచారించేందుకు అనుమతి లభించినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఇదే కేసుకు సంబంధించి నమోదైన అవినీతి కేసులో ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్‌నూ విచారించనున్నట్లు తెలిపింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బావేజాకు సీబీఐ ఈ విషయాన్ని వెల్లడించింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో కేజ్రీవాల్‌ను జూన్ 26న సీబీఐ అరెస్టు చేసింది. ఆయన జ్యుడీషియల్ కస్టడీ ఆగస్టు 27న ముగియనుంది. ఇదే సమయంలో కేజ్రీవాల్, పాఠక్‌లను ప్రశ్నించేందుకు అవసరమైన అనుమతుల కోసం 15 రోజుల సమయం ఇస్తున్నట్లు ఆగస్టు 12 న్యాయస్థానం పేర్కొంది. ఈ క్రమంలోనే సీఎం ప్రశ్నించేందుకు అనుమతి పొందినట్లు సీబీఐ పేర్కొంది. మరోవైపు, సీబీఐ అరెస్టును సవాలు, బెయిల్ విజ్ఞప్తిపై దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు సెప్టెంబర్ 5కు వాయిదా వేసింది.



ముందడుగు
శనివారం,
24-08-2024,
హైదరాబాద్

# చర్యకు ప్రతిచర్య తప్పదు

- వాస్తవాలు బయటపెడితే దాడులా..
- బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



ముందడుగు హైదరాబాద్:
రుణమాఫీపై చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరితే స్పందించడం లేదని, తమ సహనాన్ని పరీక్షిస్తే.. చర్యకు ప్రతిచర్య తప్పదని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. రుణమాఫీపై వాస్తవాలను బయటపెడుతున్నందుకు దాడులు చేస్తారా? అని ప్రశ్నించారు. కేటీఆర్‌తో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు డీజీపీని కలిశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఫిర్యాదు చేశారు. గురువారం తిరుమలగిరిలో భారాస ధర్నా శిబిరంపై కాంగ్రెస్ నేతలు దాడి చేశారని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. శిబిరాన్ని పోలీసులే తొలగించారని ఆరోపించారు. రాష్ట్రంలో బాంబుల సంస్కృతి మళ్లీ వచ్చిందని డీజీపీకి చెప్పారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "కాంగ్రెస్ నేతలు చారాణా కూడా రుణమాఫీ కూడా చేయలేదు. అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు చేశాం. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలి. భవిష్యత్‌లో చర్యకు ప్రతిచర్య ఉంటుంది" అని కేటీఆర్ అన్నారు.

# అర్హతలేని సిబ్బందితో విమానం ఆపరేషన్

## రూ.99 లక్షల జరిమానా విధించిన డీజీసీఏ




ముందడుగు జాతీయం:
అర్హత లేని సిబ్బందితో విమానాలను నడిపినందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఎయిర్ ఇండియాకు రూ.99 లక్షల జరిమానా విధించింది. అలాగే ఎయిర్ ఇండియా డైరెక్టర్ ఆపరేషన్స్, డైరెక్టర్ ట్రైనింగ్‌పై కూడా ఆరు లక్షలు, మూడు లక్షల చొప్పన అదనపు జరిమానా విధించింది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్త వహించాలని సంబంధిత పైలట్‌ను డీజీసీఏ హెచ్చరించింది. నాన్ లైన్ రిలీజ్డ్ ఫస్ట్ ఆఫీసర్‌తో జతగా నాన్ ట్రైనర్ లైన్ కెప్టెన్ నేతృత్వంలో ఒక విమానాన్ని ఎయిర్ ఇండియా నడిపింది. 2024 జూలై 10న ఈ మేరకు ఒక నివేదికను స్వచ్ఛందంగా డీజీసీఏకు సమర్పించింది. దీంతో పూర్తిస్థాయి దర్యాప్తు తర్వాత ముఖ్యమైన భద్రతా ఉల్లంఘనగా, షెడ్యూలింగ్ మార్పుగా రెగ్యులేటర్ సంస్థ గుర్తించింది. జూలై 22న సంబంధిత ఎయిర్ ఇండియా అధికారులకు షోకాజ్ నోటీస్ జారీ చేసింది. వారు ఇచ్చిన సమాధానంపై సంతృప్తి చెందకపోవడంతో సంబంధిత నియమ నిబంధనల మేరకు ఎయిర్ ఇండియాకు భారీగా జరిమానా విధించింది.

## చిన్నారులపై పదిహేను రోజులుగా

# లైంగిక దాడి

## థానే బద్లాపూర్ పాఠశాలలో విస్తుపోయే విషయాలు



ముందడుగు థానే:
థానే బద్లాపూర్ పాఠశాలలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చిన్నారులపై ఒక్కసారి కాకుండా నిందితుడు గత పదిహేను రోజులుగా పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లుగా ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక కమిటీ పేర్కొంది. ఘటనపై పాఠశాల యాజమాన్యం తీవ్ర జాప్యం చేసిందని ఎత్తి చూపింది. నిందితుడు అక్షయ్ శిందే నేపథ్యం గురించి ఎలాంటి తనిఖీలు చేయకుండానే ఆగస్టు 1న అతడిని కాంట్రాక్ట్ వర్కర్‌గా నియమించుకున్నారని కమిటీ తన నివేదికలో పేర్కొంది. పాఠశాలకు సంబంధించిన ఐడీ కూడా అతడి వద్ద లేదని తెలిపింది. స్కూల్‌లో వాష్‌రూమ్ స్టాఫ్ రూమ్‌కు దూరంగా ఉందని, పిల్లల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయలేదని వెల్లడించింది. బద్లాపుర్‌లోని పాఠశాలలో నాలుగేళ్ల వయసున్న ఇద్దరు బాలికలు టాయిలెట్ ఉన్న సమయంలో.. దానిని శుభ్రం చేసే వంకతో ఒక స్వీపర్ వారివద్దకు వెళ్లి అనుచితంగా ప్రవర్తించాడు. ఈ విషయం బయటపడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రైల్వే ట్రాక్‌లపై ఆందోళనకారుల నిరసనతో రైళ్లు నిలిచిపోయాయి. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మరోసారి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపింది. అంతేగాకుండా ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేసింది. ఆ పిల్లల క్లాస్ టీచర్, వారి బాధ్యతలు చూస్తున్న ఇద్దరు సిబ్బందిని తొలగించింది.

# చిత్రహింసలు కేకలు ఎవరికి వినిపించలేదా..

## కోల్‌కత్తా వైద్య విద్యార్థిని కేసులో పలు అనుమానాలు ▪ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న సీబీఐ




ముందడుగు పశ్చిమబెంగాల్:
పశ్చిమబెంగాల్ కోల్‌కతా వైద్య విద్యార్థిని కేసులో విచారణ చేస్తోన్న సీబీఐ పలు కీలక అంశాలు వెల్లడించింది. సెమినార్ హాల్ డోర్ బోల్ట్ పని చేయడం లేదని తమ విచారణలో బయటపడినట్లు పేర్కొంది. బాధితురాలిని చిత్రహింసలు పెడుతున్న సమయంలో సెమినార్ హాల్ లోపల నుంచి వచ్చిన శబ్దాలు ఎవ్వరికీ వినిపించకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. 'సెమినార్ హాల్ డోర్ బోల్ట్ విరిగిపోయింది. నేరం జరుగుతుండగా ఎవరూ లోనికి రాకుండా ఉండేందుకు హాల్ బయట నిల్చొని ఎవరైనా సహకరించారా' అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు సీబీఐ వెల్లడించింది. ఈ విషయాన్ని నిర్ధరించేందుకు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. బాధితురాలిని చిత్రహింసలు పెడుతున్న సమయంలో సెమినార్ హాల్ లోపల నుంచి వచ్చిన శబ్దాలు ఎవ్వరికీ వినిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందని తెలిపింది. గొళ్లెం పనిచేయకపోవడం గురించి ఇంటర్న్‌లు, జూనియర్ డాక్టర్ సిబ్బంది తమ విచారణలో బయటపెట్టినట్లు సీబీఐ వెల్లడించింది. దీంతో బోల్ట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ఆగస్టు 9న తెల్లవారుజామున 2 నుంచి 3 గంటల మధ్య హాల్‌లోకి ప్రవేశించిందని డ్యూటీలో ఉన్న వైద్యుడు చెప్పినట్లు అధికారులు తెలిపారు. కేసుకు సంబంధించి మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను శుక్రవారం సీబీఐ ప్రశ్నించింది. మరోవైపు కేసులో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కు కోల్‌కతాలో ప్రత్యేక న్యాయస్థానం 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

ముందడుగు
శనివారం,
24-08-2024,
హైదరాబాద్




## ఆంధ్ర ప్రదేశ్ & తెలంగాణలలో ఉత్పత్తి మరియు పంపిణీని పెంచిన పిడిలైట్ యొక్క రాఫ్

ముందడుగు హైదరాబాద్:
పిడిలైట్ ఇండస్ట్రీస్ నుండి ప్రముఖ టైల్స్ ఎడ్హెసివ్ బ్రాండ్ అయిన రాఫ్ హైదరాబాద్ సమీపంలోని జడ్చర్లలో తమ కొత్త తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మరియు ఈశాన్య కర్ణాటక మార్కెట్లలో అధిక నాణ్యత గల టైల్ ఎడ్హెసివ్ ఉత్పత్తుల కోసం పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి ఈ సదుపాయం తోడ్పడనుంది.

పిడిలైట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ పూరి మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ మార్కెట్‌లలో ప్రీమియం, ప్రత్యేక ఉత్పత్తులకు డిమాండ్ పరంగా స్థిరమైన పెరుగుదలను మేము గమనించాము. టైల్ మరియు స్టోన్ ఫిక్సింగ్‌ను ఆధునీకరించాలనే మా లక్ష్యంకు అనుగుణంగా మా జడ్చర్ల ప్రాజెక్ట్ ఉంది. వినియోగదారులకు మేలైన ఎడ్హెసివ్ పదార్థాలను అందించడం మరియు తయారీని మార్కెట్‌లకు చేరువ చేయడం మా లక్ష్యం.." అని అన్నారు.

పిడిలైట్ ఇండస్ట్రీస్ యొక్క పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా, ఈ సదుపాయం జీరో-వేస్ట్ ప్లాంట్‌గా పనిచేస్తుంది మరియు 80% సౌరశక్తితో నడుస్తుంది, నిర్మాణ రసాయనాల రంగంలో పర్యావరణ అనుకూల తయారీకి కొత్త ప్రమాణాలను ఏర్పరుస్తుంది.

# మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం

### రంగంలోకి దిగిన అస్సాం సీఎం ■ ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని వెల్లడి

ముందడుగు అస్సాం:
కోల్‌కతా ఘటన మరువక ముందే అస్సాంలో మరో అత్యాచారం ఘటన చోటు చేసుకుంది. మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం (గ్యాంగ్ రేప్) జరిగిన ఘటన అస్సాంలో వెలుగు చూసింది. బాలిక గురువారం సాయంత్రం ట్యూషన్ క్లాస్ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అసోంలోని నాగావ్ జిల్లాలో ఈ ఉదాంతం చోటుచేసుకుంది. ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను అరెస్టు చేసే వరకు నిరవధిక బంద్‌కు వివిధ సంస్థలు, నిర్వాసితులు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేయడంపై దేశం మొత్తం ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ఇదిలా ఉంటే.. కొన్ని రోజుల క్రితం బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో అమాయక చిన్నారులపై అత్యాచారం చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది.




బాలిక వాంగ్మూలాన్ని మహిళా పోలీసు రికార్డు చేసిందని నాగావ్ ఎస్పీ స్వప్నిల్ దేకా తెలిపారు. బాలిక తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్గురు వ్యక్తులు తనపై అత్యాచారానికి పాల్పడ్డారని పేర్కొంది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి.. ఆధారాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ ఘటనపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ కూడా స్పందించారు. అత్యాచార ఘటన మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరంగా అభివర్ణించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకోవాలని డీజీపీని ఆదేశించారు. ముఖ్యమంత్రి హిమంత ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'మైనర్‌కు సంబంధించిన భయంకరమైన సంఘటన మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరమని రాశారు'. ఈ ఘటనలో తాము ఎవరినీ విడిచిపెట్టమని హెచ్చరించారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని.. బాధితురాలికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని సీఎం బిస్వా శర్మ డీజీపీని ఆదేశించారు.

## శుద్ధి చేసిన మొలకలు గ్రేసియాతోనే ఆరోగ్యం




ముందడుగు హైదరాబాద్:
దేశం యొక్క మొత్తం సుగంధ ద్రవ్యాల ఎగుమతుల్లో 42% తో మిరప పంటలు దేశ ఆర్థిక వ్యవస్థలో మరియు రైతుల అభ్యున్నతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ, విజయవంతమైన మిరప సాగు యొక్క పునాది ఆరోగ్యకరమైన మొలకల మీద ఆధారపడి ఉంటుంది, ఇది అతి తక్కువ ఖర్చుతో కూడుకున్న మార్పిడికి దారితీస్తుంది.

“మిరప పరిశ్రమలో, విజయం అనేది నారు నాణ్యతతో ప్రారంభమవుతుంది. గ్రేషియా తో శుద్ధి చేసిన మొలకలు ఆరోగ్యంగా ఉంటాయి, నర్సరీ యజమానులకు మరింత వ్యాపారం జరిగేందుకు ఇది తోడ్పడుతుంది , ఎందుకంటే రైతులు వారి నుండి కొనుగోలు చేస్తారు, "అని గోద్రెజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సిఇఒ రాజవేలు ఎన్‌కె అన్నారు. "గోద్రెజ్ ఆగ్రోవెట్ యొక్క గ్రేసియా ఆరోగ్యకరమైన నారు పెంపకంలో చురుకైన విధానాన్ని అందిస్తుంది అని అన్నారు.

# అన్ని రంగాల్లోనూ కీలకంగా మారుతున్న కృత్రిమ మేధ

### సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి ప్రసాద్

ముందడుగు హైదరాబాద్:
కృత్రిమ మేధ(ఏఐ), మెషీన్ లెర్నింగ్ సాంకేతికతలు ఔషధరంగం సహా విద్య, తయారీ, రక్షణ రంగాల్లో ఎంతో కీలకంగా మారుతున్నాయని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) తెలంగాణ విభాగం చైర్మన్, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి డి ప్రసాద్ అన్నారు. సీఐఐ తెలంగాణ, గూగుల్ క్లౌడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన జెనరేటివ్ ఏఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ... ఫార్మా రంగంలో ఏఐని సమగ్రంగా వినియోగించుకునేందుకు దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ, హైదరాబాద్ పాటు ఇతర ప్రాంతాల్లోనూ వ్యాపారాల విస్తరణకు ఉన్న అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. సీఐఐ తెలంగాణ ఫార్మా, లైఫ్ సైన్సెస్ ప్యానెల్ కన్వీనర్, సప్తగిర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ శిల్పా రెడ్డి మాట్లాడుతూ... ఫార్మాలో సరికొత్త ఆవిష్కరణలు, మార్పుల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. గూగుల్ క్లౌడ్ ఇండియా డెవలప్మెంట్ సెంటర్ హెడ్ అనిల్ భన్సాలి మాట్లాడుతూ... వ్యాపారాల డిజిటల్ పరివర్తనకు అవసరమైన అత్యాధునిక సాంకేతిక సేవలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆరాజెన్ సీఈఓ మణి కంటిపూడి, డాక్టర్ రెడ్డీస్ చీఫ్ డిజిటల్, ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పణిమిత్ర పాల్గొన్నారు.



ముందడుగు
శనివారం, 24-08-2024, హైదరాబాద్

# సమయాన్ని బట్టి సంస్కృతం నేర్చుకోండి

## ఏకదంతాః ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి



హైదరాబాద్:
వేదకాలం నుంచి ఉన్న సంస్కృత భాష మారుతున్న పరిస్థితులను బట్టి దానిని దూరం చేసుకున్నాం. అనేక కారణాల వల్ల సంస్కృత భాష సంభాషణలో దూరమైన కూడా మన నరనరాల్లోనూ సంస్కృతం అలానే ఉంది. మన శాస్త్రాలు సంకల్పాలు ఆశీర్వచనాలు సంస్కృతంలోనే జరుగుతాయి. కర్మ, ధర్మ, పుణ్య పాపాలు మోక్షం ఇలా ఎన్నో పదాలకు అనువాద పదాలు లేవు. కాబట్టి ఈ ప్రాజెక్టు ద్వారా కనీసం భగవద్గీత లాంటి మోక్ష శాస్త్రాన్ని యధార్థముగా అర్థం చేసుకొని నిజ జీవితంలో అన్వయింపు చేసుకోవాలని స్వామి తత్త్వవిదానంద సరస్వతి వారి శిష్యులైన స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి మారుతున్న కాలముతో పాటు సంస్కృత ప్రచారం కూడా మారాలనే ఉద్దేశంతో సంస్కృత భాషా శిక్షణ ఆన్‌లైన్ మాధ్యమంలో కూడా జరగాలని ఏకదంతాః ప్రాజెక్టును రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఏకదంతః ప్రాజెక్టును భగవద్గీత శిక్షకురాలు ఆచార్య సి.హెచ్. సద్గుణ, ఫిలిం డైరెక్టర్, ఎమ్.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టుకు శ్రీ దయానంద, కృపానంద ఆర్థిక సహాయం అందించగా మొదటి లెవెల్ ని విజయవంతంగా పూర్తి చేస్తుంది. కాబట్టి 23 ఆగస్టు నెల శ్రీ డాక్టర్ అరవింద రావు గారి అమృత హస్తాల మీదుగా ఈ " ఏకదంతః" మొదటి లెవెల్ ఇంటర్నెట్లో ప్రజల ముందుకి రానున్నది.

# ఇంద్ర మూవీ టీంను సత్కరించిన మెగాస్టార్ చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు కానుకగా అతడు నటించిన ఆల్ టైం బ్లాక్ బస్టర్ ఇంద్ర సినిమాను రీ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇక ఇంద్ర సినిమా రీ రిలీజ్ అవ్వడంతో మెగాస్టార్ ఫ్యాన్స్ థియేటర్‌లలో పండగా చేసుకున్నారు. కొన్ని రోజులుగా మూతపడిన సింగిల్ స్క్రీన్ థియేటర్‌లన్ని ఇంద్ర ఎఫెక్ట్‌తో తెరచుకున్నాయి. అయితే ఈ సినిమా ఇంతటి ఘనవిజయం సాధించడంతో పాటు 22 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఇంద్ర టీంను ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించాడు. ఈ విషయాన్ని మెగాస్టార్ ఎక్స్ వేదికగా వెల్లడించాడు. 'ఇంద్ర' క్రియేట్ చేసిన సునామీ గుర్తు చేస్తూ 22



సంవత్సరాల తర్వాత మరోసారి థియేటర్స్ లో రిలీజ్ అయిన సందర్భంగా, 'ఇంద్ర' టీంకి 'చిరు' సత్కారం చేశాను. ఇంద్రను ఇంత సక్సెస్ చేసిన ప్రొడ్యూసర్ అశ్విన్ దత్, దర్శకుడు బీ గోపాల్, మరపురాని డైలాగ్స్ ని అందించిన పరచూరి బ్రదర్స్, కథనందించిన చిన్ని క్రిష్ణ, మ్యూజిక్ అందించిన మణిశర్మలకు ధన్యవాదాలు అంటూ చిరు రాసుకోచ్చాడు.



# మీ అందరి ఆశీస్సులు మాకు కావాలి : కిరణ్ అబ్బవరం

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం, నటి రహస్య గోరక్లు పెళ్లి బంధంలోకి అడుగుపెట్టారు. గత కొంత కాలంగా ఈ జంట ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మార్చి నెలలో వీరి ఎంగేజ్‌మెంట్ గ్రాండ్‌గా జరిగింది. అయితే తెలుగు సంప్రదాయ ప్రకారం గురువారం మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. వీరి పెళ్లికి సంబంధించిన ఫొటోలను పోస్ట్ చేసిన కిరణ్ అబ్బవరం మీ అందరి ఆశీస్సులు మాకు కావాలి అంటూ రాసుకోచ్చాడు. ఇక అభిమానులతో పాటు, సినీ ప్రియులు నూతన వధూవరులకు పెళ్లి శుభాకాంక్షలు చెబుతున్నారు. ఇద్దరు కలకాలం పిల్లాపాపలతో చల్లగా ఉండాలని కోరుకుంటున్నారు. 'రాజావారు రాణిగారు' (Raja Vaaru Rani Gaaru) సినిమాలో వీరిద్దరూ కలిసి నటించారు. ఇక తొలి సినిమాతోనే కిరణ్, రహస్య గోరక్ ప్రేమలో పడ్డారని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే మొదట్లో స్నేహితులుగా ఉన్నా.. ఆ తర్వాత వీరి స్నేహం ప్రేమగా మారింది.

ముందడుగు
శనివారం, 24-08-2024, హైదరాబాద్

# క్షణాల్లో మనిషి ప్రాణాలు తీసే జంతువులు..

## ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర 10 జంతువులు ■ ఆ జంతువులు ఏంటో ఒకసారి తెలుసుకుందాం..





ముందడుగు ప్రత్యేకం:

ప్రపంచంలో ఎన్నో రకాల జీవరాశులు ఉన్నాయి. కొన్ని నేలపై ఉంటే మరికొన్ని నీటిపై, కొండలపై జీవిస్తాయి. సాధారణంగా జనావాసాలకు దూరంగా ఉండే వివిధ రకాల ప్రాణుల్లో కొన్ని విషపూరితమైనవి ఉంటాయి. వీటిలో కొన్ని భారీ ఆకారంలో, పెద్ద సైజులో ఉంటాయి. వాటిని ఇబ్బంది పెట్టే మానవులకు, ఇతర జంతవులకు హాని తలపెడతాయి. అందుకే వీటితో ఎంతో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా కొన్ని జీవజాతులు సెక్షన్లలోనే మనిషిని చంపేయగలవు. భూమిపై అత్యంత ప్రమాదకర జీవులుగా పేరున్న అవి ఏంటివో ఒకసారి తెలుసుకుందాం..

### ఉప్పునీటి మొసలి

ఉప్పునీటి మొసళ్లు భారీ ఆకారంలో, చాలా దూకుడుగా ఉంటాయి. ఆగ్నేయాసియా, ఉత్తర ఆస్ట్రేలియాలోని ఉప్పునీటి సరస్సుల్లో కనిపిస్తుంటాయి. 23 అడుగుల పొడవు, 2,200 పౌండ్ల బరువుతో చూడటానికి భయంకరంగా కనిపిస్తాయి. ఏటా అనేక మంది పర్యాటకులపై ఇవి దాడులు చేస్తున్నాయి. ఉప్పునీటి మొసళ్లకు శక్తివంతమైన దవడలు ఉంటాయి. నిమిషాల వ్యవధిలో ఎముకలను చూర్ణం చేస్తాయి. నీటిలో నుంచి మెరుపుదాడి చేస్తూ ఎరను లాగేసుకుంటాయి.

### ఆఫ్రికన్ ఏనుగు

భారీ ఆకారంతో ఉండే ఏనుగులు సాధారణంగా మావటి చెప్పినట్లు వింటాయి. అయితే అడవుల్లో నివసించే ఆఫ్రికన్ ఏనుగులు మాత్రం చాలా ప్రమాదకరం. ఇవి ఏకంగా 14,000 పౌండ్ల వరకు బరువు ఉంటాయి. భారీ శరీరంతో క్షణాల్లో విధ్వంసం సృష్టించే సామర్థ్యం వాటి సొంతం. ఏటా ఏనుగుల దాడుల్లో దాదాపు 500 మంది చనిపోతున్నారు.

### కేప్ గేదె

ఆఫ్రికాలోని సహారా చుట్టుపక్కల ప్రాంతాల్లో కేప్ గేదెలు కనిపిస్తుంటాయి. అత్యంత ప్రమాదకర జంతువుల్లో ఇవి ఒకటి. అనూహ్యంగా దాడి చేయడంలో ఈ గేదెలు దిట్ట. ఇవి 1,500 పౌండ్ల వరకు బరువు ఉంటాయి. ఆఫ్రికాలో కేప్ గేదెల దాడిలో మరణిస్తున్న వారి సంఖ్య ఎక్కువే. వీటి కొమ్ములు చాలా బలంగా ఉంటాయి.

### పాయిజన్ డార్ట్ కప్ప

ఇవి మధ్య, దక్షిణ అమెరికాలో కనిపిస్తుంటాయి. చూడటానికి చిన్నగా ఉన్నా, చాలా విషపూరితమైనవి. ప్రకాశవంతమైన రంగులతో ఇవి ఎదుటి వారికి హెచ్చరికలు పంపుతాయి. ఈ కప్పల చర్మంలో బాట్రాచోటాక్సిన్ అనే విషం ఉంటుంది. ఇది పక్షవాతం, మరణానికి దారితీస్తుంది. అందుకే వీటిని అత్యంత ప్రమాదకర జంతువులుగా పరిగణిస్తారు.

### పఫర్ ఫిష్

ఉష్ణమండల, ఉప ఉష్ణమండల(భూమధ్య రేఖ సమీపం) సముద్ర జలాల్లో పఫర్ ఫిష్‌లు కనిస్తుంటాయి. ఏదైనా ప్రమాదం ఏర్పడితే తమ శరీరాలను రక్షణ కవచంగా ఉపయోగిస్తాయి. పఫర్ ఫిష్‌లో టెట్రోడోటాక్సిన్ అనే విషం ఉంటుంది. ఈ పాయిజన్ మన శరీరంలోకి వెళ్తే పక్షవాతం రావచ్చు, చనిపోవచ్చు.

### దోమలు

కొన్ని రకాల జీవులు చాలా ప్రాణాంతకమైనవి. దోమల కాటు కారణంగా ఏటా 7 లక్షలకుపైగా మరణాలు నమోదవుతున్నాయి. అందుకే వీటిని అత్యంత ప్రాణాంతక జీవులుగా పరిగణిస్తున్నారు. ఈ కీటకాలు మలేరియా, డెంగ్యూ, జికా వైరస్ వంటి వైరల్ వ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయి. మలేరియాతో ఏటా నాలుగు లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఆఫ్రికాలోని సహారా ప్రాంతంలో ఉండే అనాఫిలిస్ జాతికి చెందిన ఆడ దోమలు మలేరియాకు వాహకాలు. నిల్వ ఉన్న నీటిలో వీటి సంతానోత్పత్తి ఎక్కువగా ఉంటుంది.

### బాక్స్ జెల్లీ ఫిష్

ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని సముద్రాల్లో బాక్స్ జెల్లీ ఫిష్‌లు కనిపిస్తుంటాయి. సముద్రంలో అత్యంత విషపూరితమైన జీవుల్లో ఇవి ఒకటి. ఈ చేపలు కాటువేస్తే వాటి టెన్టకిల్స్ నుంచి వెలువడే విషం నిమిషాల్లో మనిషి గుండె వైఫల్యానికి, పక్షవాతానికి దారితీసి మరణానికి కారణమవుతుంది. జెల్లీ ఫిష్‌లను నీటిలో గుర్తించడం చాలా కష్టం.

### కోన్ నత్త

వెచ్చని ఉష్ణమండల జలాల్లో కనిపించే కోన్ నత్తలు చూడటానికి చాలా అందంగా ఉంటాయి. అయితే ఇవి చాలా ప్రమాదకరమైనవి. ఈ నత్తలు హార్పూన్ వంటి దంతాలను కలిగి ఉంటాయి. వాటిలో కొనోటాక్సిన్ అనే విషం ఉంటుంది. దీని కాటుకు గురైతే శ్వాసకోశ వైఫల్యంతో పాటు చనిపోవచ్చు. కాగా, గోల్డెన్ పాయిజన్ డార్ట్ కప్పలు, ఇన్‌లాండ్ టైపాన్ వంటి పాములు కూడా అత్యంత విషపూరితమైనవి.

### గోల్డెన్ పాయిజన్ డార్ట్ కప్ప

ఇవి కొలంబియాలో కనిపిస్తుంటాయి. భూమిపై అత్యంత విషపూరితమైన జంతువుల్లో ఇవి ఒకటి. ప్రకాశవంతమైన పసుపు రంగుతో ఇతర జంతువులకు హెచ్చరికలు పంపుతాయి. చిన్న పరిమాణంలో ఉండే గోల్డెన్ పాయిజన్ డార్ట్ కప్పలు ప్రాణాంతక విషాన్ని కలిగి ఉంటాయి.

### ఇన్‌లాండ్ తైపాన్

ఇది ప్రపంచంలోనే అత్యంత విషపూరితమైన పాము. ఆస్ట్రేలియాలో కనిపిస్తుంది. ఇది కాటు వేస్తే 45 నిమిషాల్లో మనిషి చనిపోతాడు. ఈ పాము విషంలో న్యూరోటాక్సిన్స్, హెమోటాక్సిన్స్, మయోటాక్సిన్స్ ఉంటాయి. ఇది ఒంటరిగా జీవిస్తుంది.



